


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

సంపుటి : 4 సంచిక : 25 పుష్పం :31 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)




**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-3-99, పాలకోడేరు)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా!**

భగవంతునికి ఒకరూపంలేదు. ఒకనామంలేదు. మనకోసం అవసరాన్ని బట్టి కల్పించుకుంటాడు. అది ఎప్పుడు కల్పించుకోవాలో ఆకాలాన్ని భగవంతుడే నిర్ణయించుకొంటాడు. ఈ రోజు శ్రీరామనవమి అంటే రాముడు ఈ భూమి మీద అవతరించినరోజు. భారతీయులు ఎక్కువమంది రామచంద్రమూర్తినే ఆరాధిస్తారు. క్రమశిక్షణ, తెలివి, పట్టుదల, సాహిత్యం ఇవి కొంతమందిలో ఒకటి ఉంటే ఒకటి ఉండదు. రామచంద్రమూర్తిలో ఇవి అన్నీ కనిపిస్తాయి. ఒక మనిషి యొక్క స్వరూపం ప్రాణం పోయేటప్పుడు తెలుస్తుంది. గాంధీ గార్కి రామనామము మీద సజీవమైన విశ్వాసము. అందువలన ప్రాణప్రయాణ సమయంలో ఆయన రాముడినే స్మరించారు. మనం ధశరథుడు కుమారుడు రాముడి యొక్క నవమి చేసుకుంటున్నాం. రాముని ఆరాధించడం, రామనామం స్మరించడం ఎందుకు అంటే అది మన హృదయంలో ఉన్న ఆత్మారాముడిని తెలుసుకోవడానికి సహకరిస్తుంది. ఆంజనేయ స్వామి ఉత్తమభక్తుడేకాదు, ఉత్మమగురువు కూడా. మనం దేవాలయానికి వెళితే భగవంతుని ఏదో ఒకటి కోరతాం. కాని ఆయన భౌతికంగా రాముడిని ఏదీకోరలేదు. ఏదో ఒకటి ఆశించి భగవంతుని ప్రార్థించడంవేరు. ఏకోరికా లేకుండా భగవంతుడిన్ని భగవంతుడి కోసమే ప్రేమించడం వేరు. ఆంజనేయస్వామికి రాముడిమీద నిండు ప్రేమ ఉంది. అందుచేత ఆయన ఉత్తమ భక్తుడు. గరువు యొక్క లక్ష్యం ఏమిటంటే జీవుడిని దేవుడిలో ఐక్యపరచడం, జీవుడిని భగవంతునిలో ఐక్యపరచడానికి అనుకూలమైన మాటలు చెప్పాలి. నీకు ఎంత తెలివి ఉన్నా, ఎంత బుద్ధి ఉన్నా, ఎంత జ్ఞానం ఉన్నా, అది నీకు పరమాత్మలో ఐక్యం అవ్వటానికి సహకరించాలి. ఇక్కడ సీతమ్మ జీవుడు, రాముడు దేవుడు. సీతను రాముడిని కలిపాడు. అందువలన ఉత్తమగురువు అని గాంధీగారు చెప్పారు. జీవుడిని పరమాత్మలో ఐక్యంచేయటానికి ఎంతో కృషిచేసాడు. అందువలన ఆంజనేయస్వామి ఉత్తమభక్తుడేకాదు, ఉత్తమ గురువుకూడా.

ఆంజనేయస్వామికి కోరికలంటూ ఏమీలేవు. కాని ఆయన రామచంద్రమూర్తిని ఒకటి అడిగాడు. ఎక్కడైతే ఇష్టంగా, ప్రేమగా రామనామం చేస్తున్నారో, అక్కడ నేను ఉండేటట్లు ఆశీర్వదించు అని రాముడిని అడిగాడు. మనం చేసే పని బాధ్యతగా చేయాలి. బాధ్యతగా చేస్తే పని పూర్తవుతుంది. భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతాము. మనం బాగుపడాలన్నా, సమాజం బాగుపడాలన్నా, మనం బాధ్యతగా పనిచేయాలి. మీకు ఓపిక ఉన్నంతసేపూ పని చెయ్యాలి. పనిచేసి అన్నం తినండి. పనిచేయకుండా అన్నం తినకండి అని బాపూజీ చేప్పేవారు. నరశింమెహతా అనే ఒక భక్తుడు ఉండేవాడు. ఆయన చిన్నతనం నుండి ఇంటి దగ్గర ఏదో

ఒకటి తినటం, ఏదోగుడిలో భగవంతుని స్మరించుకొంటూ ఉండటం ఇలా ఉండేవారు. ఒకరోజు భోజనం చేసేటప్పుడు ఆయన వదినగారు నీవు పని చేయుటంలేదు, పందిలాగ తింటున్నావు అంది. ప్రక్కనే ఉన్న అన్నగారు కూడా ఆవిడనే సమర్థించాడు. కాని నరశింమెహతా ఏమీ అనలేదు. మధ్యలో భోజనం మానలేదు., చివరి ముద్ద వరకు తిన్నాడు. వారితో ఏమి గొడవపడలేదు. ఇంటినుండి వెళ్ళిపోయాడు పెద్దభక్తుడయ్యాడు. ఆయన ఏమి చెప్పాడు అంటే మనకు ధైర్యం ఉండాలి. అది నిర్మలంగా నిశ్చలంగా ఉండాలి. పైకి సహజంగా ఉండాలి లోపల ధైర్యం పెంచుకోవాలి. అది కామ్‌కరేజ్. మనకు కామ్‌కరేజ్ ఉండాలి అని నరశింమోహతా చెప్పాడు.

ఈశ్వరుని ప్రేమించు. ఆ ప్రేమలో దేహగతమైననేను కరగాలి. అది కరగకపోతే తాత్కాలికంగా నీకు శాంతి వచ్చినా, ఆనందం వచ్చినా అది విజృంభించే అవకాశం ఉంది. ప్రేమ అంటే భగవంతుడే, జ్ఞానం అంటే భగవంతుడే ఆ ప్రేమలో, జ్ఞానంలో ఏదైతే నీవు నేను, నేను అంటున్నావో ఆ నేను కరగాలి. భగవంతుడిని ప్రేమించి మిధ్యానేనును తొలగించుకొంటే ఆ ప్రేమే నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. సూర్యుడియొక్క కిరణాలు మన శరీరాన్ని ఎలా తాకుతాయో అలాగ నీవు భతవంతుడిని ప్రేమించగా, ప్రేమించగా ఆయనను ధ్యానించగా, ధ్యానించగా ఆయన జ్ఞానతరంగాలు నీబుద్ధిని తాకుతాయి, నీ బుద్ధిని జ్ఞానమయం చేస్తాయి. సూర్యకిరణాలు మన శరీరాన్ని తాకటం అనేది బాహ్యంగా జరుగుతోంది కాబట్టి అది నిజం అని మనకు అనిపిస్తుంది. భగవంతుడు చేసేది అంతర్గతంగా జరుగుతుంది. ఈశ్వరుని ప్రార్థించగా, ప్రార్థించగా ఆయన అనుగ్రహకిరణాలు మనకు తెలుస్తాయి. సాధనాబలం వలన వాసన క్షీణిస్తుంది గాని సాధనాబలం లేకుండా వాసన క్షీణించదు. ఈశ్వరుని ప్రేమించగా ప్రేమించగా వాసన తనంటతానుగా పల్చబడుతుంది. వాసన ఎప్పుడైతే నశించిందో ఇంక నీకు కోరికరాదు. నీకు భౌతికంగా ఏ వస్తువులమీద వాంఛ లేదు అనుకో నీకు మిగిలేది ప్రేమే. రాముడు అవతారపురుషుడే ఆయన రావణాసురిని దేహాన్ని చంపాడు. మనిషియొక్క శరీరాన్ని చంపకుండా వాడిలో ఉన్న దుర్గుణాలను ఎవడైతే చంపుతాడో వాడు అవతారవరిష్టుడు. అంటే దేహాన్ని చంపకుండా వాసనను చంపేవాడు అవతార వరిష్టుడు అంటే అవతారపురుషులలో శ్రేష్టుడు.

శరీరం చనిపోవటం అంటే ప్రాణం పోవటం, ఆప్రాణమే నీవు అయితే శరీరం చనిపోయినప్పుడు నీవు పోతావు. ఆ ప్రాణం నీవుకాదు. అందుచేత చనిపోయినప్పుడు నీవు పోవు. చావుఅనేది కేవలం దేహానికి సంభందించినది. పుట్టుక కూడా కేవలం దేహానికి సంభందించినది. ఇలా జన్మిస్తూ మరణిస్తూ ఇలా ఎన్నో దేహాలలో నీవు కృషి చూస్తూఉంటే, పుణ్యం సంపాదించుకొంటూ ఉంటే, సత్పురుషులతో సహవాసం చేయగా చేయగా ఏదో ఒక శరీరంలో ఈశ్వరానుగ్రహం వలన నేను పుట్టేలేదు అనే విషయం సడన్‌గా నీకు స్ఫురిస్తుంది. అదే మోక్షం. శరీరం మరణించిన ఒక అమృతస్థితి నీ హృదయంలో ఉంది. అమృతస్థితి నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దానికి పుట్టుక లేదు కాబట్టి మనకు పుట్టుక లేదు అని నీకు తెలుస్తుంది. అదే కడసారి జన్మ అవుతుంది. మీకు అమృతానుభవం కలిగిన తరువాత బయట వ్యక్తులతో గాని వస్తువులతో గాని సంభందంలేని పరిశుద్ధ ఆనందం మీకు అందుతుంది.

ఎప్పుడో కాదు ఈ శరీరం శవం అవ్వకముందే జ్ఞానగంగ మీకు అందుతుంది. అప్పుడు దేహం ఉన్నా, దేహం లేకపోయినా ఒక్కటే. ఆస్ఫురణ గురువు అనుగ్రహం వలన కలుగుతుంది. ఆ ముహూర్తం గురువే పెట్టుకుంటాడు. భగవంతుడిలోని ప్రేమ, ఆనందం, సత్యం నీకు ఎప్పుడైతే స్వరూపంగా వ్యక్తమయ్యిందో అప్పుడు నీకు ద్వైత భావన నశిస్తుంది. అద్వైత భావన కలుగుతుంది. నీకు ఏదో తలంపులు వస్తూ ఉంటాయి, మాట్లాడుతూ ఉంటావు. కాని బాధ్యత పెట్టుకున్నప్పుడు వచ్చే తలంపే నిదానంగా ఉంటుంది. మిగతా తలంపులు అన్నీ గాలికి పోతాయి, పనికి వచ్చేవికావు.

నేను భగవంతుడిని ప్రేమిస్తున్నాను అని నీవు అనుకొంటున్నావు. ఎందుకు ప్రేమిస్తున్నావు? ఆ ప్రేమవలన నీవు ఎవడో నీకు తెలియబడుతుంది. అందుకు ప్రేమిస్తున్నావు. ఆ ప్రేమ గుడ్డిది కాదు. ఆ ప్రేమకు కూడా ఒక లక్ష్యం ఉంది. నీవు బ్రహ్మమే, ఈశ్వరుడి మీద నీకు ఉన్న ప్రేమ నీవు బ్రహ్మమే అన్న సంగతి నీకు ఎరుకలోనికి తీసుకొనివస్తుంది. అదే ప్రేమ యొక్క లక్ష్యం. జీవుడిని ఈశ్వరుడిలో ఐక్యం చేయలేని జ్ఞానం జ్ఞానమా? జీవుడిని ఈశ్వరునిలో ఐక్యంచేయలేని భక్తి అదో భక్తా? కానేకాదు. నీవు తలంపులలో నుండి, సంస్కారములలో నుండి, ఉపాదిబుద్ధిలో నుండి బయటకు వస్తే మిగిలేది భక్తే, మిగిలేది ప్రేమే, మిగిలేది ఆనందమే. నీవుకాని దాని మీద మోహం విడచిపెట్టగలిగితే నీవు ఎవరో నీకు తెలియబడుతుంది. గాఢనిద్ర, జాగ్రదావస్థ, స్వప్నావస్థ ఇవి మూడూ వస్తూఉంటాయి, పోతూ ఉంటాయి. ఈ మూడూ నిజంకాదు. ఈ మూడు అవస్థలు కూడా దేహాభిమానం మీద ఆధారపడి ఉన్నాయి. దేహాభిమానం పోతే ఈ అవస్థలు కూడా పోతాయి. ప్రేమ యొక్క ఔన్నత్యం తెలిసినవాడు ప్రపంచాన్ని ప్రేమించకుండా ఉండలేడు. ప్రేమ యొక్క ఔన్నత్యం నీకు ఎప్పుడు తెలుస్తుంది అంటే అది నీకు స్వరూపంగా వ్యక్తమయినపుడు దాని విలువ నీకు తెలుస్తుంది. నీకు కర్మ మార్గం ఇష్టం లేదు అనుకో. నీకు ప్రేమ మార్గం
ఇష్టం అనుకో. అందులోనే ప్రయాణం చెయ్యి. మధ్యలో ఆగకు. శిఖరం వరకు వెళ్ళిపో. నీ భక్తి, నీ ప్రేమ నీలోపల ఉన్న చైతన్యాన్ని నీకు ఎరుకలోనికి తీసుకునిరావాలి. ఈదేహము నేను, ఈ దేహము నాది అనే భావన ఎంత స్పష్టంగా తెలుస్తోందో మరణంలేని వస్తువుకు సంబంధించిన ఎరుక అంత స్పష్టంగా నీకు కలగాలి. అది ప్రేమయొక్క లక్ష్యం, భక్తి యొక్క లక్ష్యం. భక్తి ఆపనిచేయలేదు అనుకో అది భక్తికాదు.

ఆత్మలో ఉన్నది సత్యమే. ఆత్మలో ఉన్నది ప్రేమే, ఆత్మలో ఉన్నది ఆనందమే. అంతకు తప్పించి అందులో ఏమీలేదు. ప్రేమతో లోకాన్ని జయించగలముకాని అసూయతో లోకాన్ని జయించలేము. మీకు అశాంతి వచ్చింది అనుకోండి కొద్దికాలం ఉంటుంది తరువాత పోతుంది అశాంతి నిజంకాదు. మీకు ఎవరితోనైనా వైరం వచ్చినా అది నిజంకాదు. నిజంలాగ మీకు అనిపిస్తుంది. గాని కాల ప్రవాహంలో అది కొట్టుకొనిపోతుంది. శాంతి నిజం, ప్రేమనిజం, స్నేహంనిజం, అప్యాయత నిజం, చనిపోవటం పుట్టటం అనేది చిక్కుముడి, అది చిజ్జడ గ్రంథి. ఆముడి భౌతికంగా చేతులతో తీసేదికాదు. భగవంతుని ప్రేమించగా, ప్రేమించగా ఆ చిక్కుముడి దానంతట అదే విడిపోతుంది. అప్పుడు ప్రకృతిలో నుండి నీవు బయిటపడతావు. ఆ ముడి తెగదు అనుకో ప్రకృతి ప్రవాహంలో కొట్టుకుని పోతావు. ప్రేమను చూడు, ప్రేమనుగురించి

చూడు. దానిని హృదయంలో అనుభవించు. ప్రేమను అనుభవించేటప్పుడు అద్భుతమైన, అలౌకికమైన, అపూర్వమైన ఆనందం, పరమానందం, పరమాత్మకు సంబంధించిన ఆనందం నీకు వ్యక్తమవుతుంది. ఆ ప్రేమను అనుభవించే ప్రక్రియలోనే అలౌకికమైన ఆనందం పుట్టుకు వస్తుంది. మనం గయ వెళతాము. అక్కడ ఏదో ఒకటి విడచి పెట్టాలికదా అని కాకారకాయ విడచి పెడతాము. చాలామందికి అది ఇష్టం ఉండదు. అది విడిచి పెడతాము. పండ్లలో మనకు దొరకని పండును చూసి అది విడిచి పెడతాము. అది భక్తా? అది భక్తి కాదు. మీకు ఏదైతే ఇష్టమో, ఏదైతే ప్రియతో దానిని విడచి పెట్టాలి గాని మీకు ఇష్టంలేని వాటిని విడిచి పెట్టి వాటిని విడిచి పెట్టాము అని చెప్పటం కాదు.

ఈ క్షణంలో నాకు ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించండి అని నేను అడగటంలేదు. ఆత్మ జ్ఞానం సంపాదించాలనే కాంక్ష బలీయంగా, ప్రగాడంగా ఉండేటట్లు నన్ను అనుగ్రహించండి, జ్ఞానం పొందాలి అనే కాంక్ష నాలో మరణించకుండా అది ఉజ్వలంగా ప్రకాశించేలాగ అది పొందే వరకు ఆ తపన యొక్క వేగం సజీవంగా ఉండేలాగ నన్ను ఆశీర్వదించండి అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీకు తపన కావాలంటున్నావు. సాక్షాత్కారాన్ని అడగకుండా అడుగుతున్నావు. తపన ఉంటే సాక్షాత్కారము దాని అంతట అదే వస్తుంది. మోక్షం కోరేవాడిని ముముక్షువు అంటారు. మోక్షకాంక్ష ఎక్కడయితే ఉందో వాడికి మోక్షం రాకుండా మనం ఆపుచేయలేము. ముముక్షువుకు మహాతులతోటి జ్ఞానులతోటి సహచర్యం దొరికింది అనుకొండి వాలుగాలిలో సైకిలు త్రొక్కినట్లు ఉంటుంది. అదే వాడిని గమ్యానికి తోసుకొంటూ పోతుంది. జ్ఞానం సంపాదించాలి అనేకాంక్ష ఉన్నప్పుడు, తపన ఉన్నప్పుడు అది వచ్చి తీరుతుంది ఎందుచేత నంటే తపన తీసుకొనివెళ్ళేది అక్కడికే. జిజ్ఞాస ఉంటే అదే మీకు జ్ఞానాన్ని పట్టి ఇస్తుంది.

నీకు ఏ కారణం వలన అయినా దుఃఖం వస్తూ ఉంటే అక్కడ మనస్సు ఉంది అని అర్థం. మనస్సు కరిగిపోయింది అనుకో ఏదీ మిమ్మల్ని దుఃఖ పరచలేదు. మీ దుఃఖం అంతా కూడా ఆనందంగా, శాంతిగా మారిపోతుంది. ప్రకృతి మాటలు వినకుండా, ప్రకృతి దృశ్యాలు చూడకుండా, ప్రకృతి విషయాల గురించి ఆలోచించకుండా నీవు ఉండగలిగితే మనస్సు కరిగిపోతుంది. మనస్సు కరిగిపోవటం వలన నీ అస్థిత్వం ఏమీపోదు అది ఆత్మలో లయమవుతుంది. అప్పుడు ఆత్మే తానుగా నీకు వ్యక్తమవుతుంది. ఇంతకంటే మించినది ఈ సృష్టిలో ఏమీలేదు. సాధన చెయ్యి, సాధనచెయ్యి సాధనలో ఏమీ లేదు అని తెలిసేవరకూ సాధన చెయ్యి అనే వారు భగవాన్. ఎందుచేతనంటే ఆ సాధన చేసే సాధకుడే మిధ్య. వాడు నిజం అనుకొంటున్నావు కాబట్టి సాధన చెయ్యి. సాధన చేసి, సాధనచేసి ఆసాధన చేసే సాధకుడిని ఒక ప్రక్కన పెట్టు అది సాధన యొక్క లక్ష్యం.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL ☎ 24776